# ప్రమిద

'మి మల్ని ఆఫీసర్‌గారు పిలుస్తున్నారమ్మా'! అన్నాడు ప్యూన్ సవినయంగా. పనిలో మునిగియున్న శ్యామసుందరి ఆశ్చర్యపోతూ తల ఎత్తింది.

ప్యూన్ మళ్ళీ అదే మాట అన్నాడు.

చిన్నగా తలవూపి, చటుక్కునలేచి - ఆఫీసర్ రూమ్ వేపు నడిచింది శ్యామసుందరి.

"సీతమ్మవారికి కబురొచ్చింది. ఏదో వున్నది యివాళ" ప్రక్కనేవున్న టైపిస్ట్ రామనాధంతో అంటున్నాడు ఎల్.డి.సి. శంకర్రావ్.

రామనాధం విచిత్రంగా మందహాసం చేశాడు, శ్యామసుందరి స్వింగ్‌డోర్స్ తెరుచుకుని ఆఫీసర్ రూమ్‌లోకి అడుగు పెట్టటం చూసి.

"ఏవో చివాట్లు వేయటానికి ఆవిడ్ని పిలిచాడంటావా మన యముడు?" శర్మ రామనాధంతో అన్నాడు.

"చివాట్లు మగవాళ్ళకేగాని ఆడవాళ్ళకి వుండవ్ బాబూ ఆఫీసుల్లో - అందులోనూ శ్యామసుందరి - మొగుడికి విడాకులు గూడ యిచ్చింది. ఇక ఆవిడని చివాట్లు వేస్తాడా మన యముడు!" పైకి కనిపించకుండా నవ్వాడు - శంకర్రావ్. రామనాధం, శర్మ అతనిలో నవ్వు కలిపారు.

''ఇది వంటిల్లు కాదండీ - ఆఫీస్ - ఇక్కడ పనులు ఆడుతూ - పాడుతూ చేయటానికి వీల్లేదు. చూశారా! మీవల్ల నేను పై ఆఫీసర్ల నుంచి ఎంతమాట పడవలసి వచ్చిందో - మీరు యింత అన్యమనస్కంగా పనిచేస్తే లాభం లేదు. మీకు జీతం గవర్నమెంటుకి డబ్బు ఎక్కువ వుండి యివ్వటంలేదు - మీమీద యాక్షన్ తీసుకుందామంటే - ఆడదాని మీద యాక్షన్ తీసుకున్నాడని మళ్ళీ నన్నే అంటారు. ఏం చేయను నేను? అసలు ఈ ఆడవాళ్ళని ఈ ఆఫీసులో పోస్ట్ చేయవద్దని అన్నా నా మాట వినకుండా మిమ్మల్నిక్కడ వేశారు. మీరేమో బాధ్యతలు మరచి నా పీకలమీదకి తెస్తున్నారు - యిలా అయితే ఎలా''? ఆఫీసర్ గొంతు ఖంగ్‌మని వినిపిస్తోంది బయటకు కూడా.

రామనాథం, శర్మ, శంకర్రావే కాకుండా తతిమ్మా స్టాఫ్ కూడా చెవులు రిక్కించారు.

''ఎక్స్క్యూజ్‌మీ సార్ ! ఈ సారికి పొరపాటయిపోయింది. ఇక ఎప్పుడూ పొరపాటు జరగనివ్వను''! నూతిలోనుంచి వస్తున్నట్టుగా వుంది శ్యామసుందరి కంఠస్వరం.

''ఇది మీకు మొదటిసారి కాదు - మూడోసారి - దేనికైనా హద్దూ పద్దూ వుండాలి - కాస్త మనస్సు స్వాధీనంలో వుంచుకొని పనులు చేస్తే పొరపాట్లు జరగవ్''.

శంకర్రావ్ వెగటుగా నవ్వాడు. ''గురూ! యముడు శ్యామసుందరి మనసు ఆఫీసులో ఉండదని తెలుసుకున్నాడు!''

యింతలో స్వింగ్‌డోర్స్ తెరుచు కోవటంచూసి ఆఫీస్ స్టాఫ్ అంతా ఎవరి సీట్లలో వాళ్ళు సర్దుకూర్చున్నారు.

శ్యామసుందరి తల వంచుకుని బయటకు వచ్చింది. ఆమె ముఖం ఎర్రగా కమిలి పోయివుంది. నెమ్మదిగా వెళ్ళి తన సీట్లో కూర్చుంది - ఫైలు అందుకుంది - కాని వంచిన తల ఎత్తలేదు.

శంకర్రావ్ శర్మకేసి చూసి చిన్నగా నవ్వాడు.

ఆఫీసర్ బూట్లు టకటక శబ్దం చూసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. బయట జీప్ బయలుదేరిన శబ్దమయింది.

శంకర్రావ్ తన సీట్లోంచిలేచి మెల్లగా వెళ్ళి - శ్యామసుందరి ముందు నిలబడ్డాడు. ఆమె అతన్ని గమనించక - తన పనిలో నిమగ్నమయిపోయింది. ఒక నిముషం తర్వాత అతను నెమ్మదిగా దగ్గాడు.

ఆమె తల ఎత్తింది.

''మీరేమీ బాధపడకండి శ్యామసుందరీ దేవిగారూ ! మన ఆఫీసర్‌గాడి తత్వమే అంత - వట్టి మానర్స్‌లెస్ క్రీచర్ - ఎంత తోస్తె అంత అంటాడు - ఏదో చూసీ చూడనట్టుగా దులిపేసుకుపోవాలి వాడితో'' టేబుల్ మీద చేతులు ఆనించి ఓదార్పుగా అన్నాడు శంకర్రావ్.

శంకర్రావేకాదు - ఆ ఆఫీసులో ఎవర్ని చూసినా శ్యామసుందరికి పరమ అసహ్యం. వాళ్ళ వెకిలి పిలుపులూ - వెక్కిరింతలూ - మనిషిని తినేసేటట్లు చూసే ఆ చూపులూ ఆమె

ఏనాడూ భరించలేదు - కాని సభ్యతగా ఉండదని చిన్నగా అన్నది. -

"ఆయన్ని అనీ ప్రయోజనంలేదులేండి - తప్పు నాది - నా వల్లనే ఆయనకి పై ఆఫీసర్ల నుంచి మాట వచ్చింది." తల వంచుకున్నది ఆమె.

"ఆఁ! సింగినాదం - అంతా పైకే నండీ. ఒక లెవెల్ దాటిన తర్వాత మాటా లేదు - ఆటా లేదు - అంతా వకటే. పైకి ఏదో నాటకం ఆడుతుంటారు", ఫైళ్ళని కొంచెం ప్రక్కకినెట్టి - బల్ల మీద కూర్చుంటూ అన్నాడు శంకర్రావ్.

'హాఛ్' అని రాని తుమ్ము ఒకటి తుమ్మాడు శర్మ.

ఆఫీసంతా గొల్లుమంది.

శ్యామసుందరి ముఖం మరింత ఎర్రనయింది.

"ప్లీజ్ మీరు టేబుల్ మీద నుంచి లేస్తారా!" అన్నది యిక భరించలేక.

శంకర్రావ్ వులిక్కిపడి లేచినుంచుని 'సారీ మాడమ్ - అప్పులుగావున్నవారిని ఓదార్చాలంటే కొంచెం చనువు తీసుకోవాల్సి వస్తుంది అందుకని...." నసిగాడు.

రామనాధం వేపు మళ్ళీ బిగ్గరిగా నవ్వాడు.

రామనాధం తీక్షణంగా చూసింది శ్యామసుందరి.

రామనాధం ఆమెను కళ్ళతోనే నమిలి మింగేసేలా చూస్తున్నాడు. అతని కళ్ళల్లో గుప్తంగా ఉన్న కోర్కె - ఎంతదాచినా స్పష్టమవుతూనేవుంది.

'మన ఆఫీసర్ మీ మీద ఛార్జ్‌షీటు దాఖలుచేస్తాడో ఏమో' - ఆయనికి తనని నిర్లక్ష్యం చేసేవాళ్ళంటే తగనిమంట'. అన్నాడు శంకర్రావ్ అంటూనే ఏదో చెబుతున్నవాడిలా కొంచెం ముందుకి వంగాడు - 'అయినా కొంచెం మచ్చిక చేసుకుంటే - ' చాలా నెమ్మదిగా యింకా అనబోతున్నాడు శంకర్రావ్.

చటుక్కున కుర్చీలోంచి లేచింది శ్యామసుందరి 'షటప్ యూ'! అని పెద్దగా అరచింది - ఆమె మృదువయిన చేయి మెరుపుతీగలా పైకి లేచింది - రెప్పపాటులో రెండడుగులు వెనక్కి వేశాడు శంకర్రావు. లేకపోతే అయిదు వేళ్ళూ అతని చెంప మీద ముద్ర వేసేవేమో - ఆమె కోపంతో వూగిపోతున్నది. ఆఫీస్ స్టాప్ ఎవ్వరూ మాట్లాడలేదు. ఏదో విపరీతం చూస్తున్నట్టుగా శిలాప్రతిమల్లా కూర్చున్నారు. శంకర్రావ్ ఏదో అనబోయి, ఏమీ అనలేక వెళ్ళి తన సీట్లో తల వంచుకుని కూర్చున్నాడు. శ్యామసుందరి కొంతసేపటికి తమాయించుకుని ఫైలు ముందేసుకు కూర్చుంది. కాని- ఆమె ఎప్పుడు అయిదవుతుందా ఎప్పుడు బయటపడదామా అని ఎదురుచూస్తూ కూర్చుంది. కాని ఎక్కువసేపు అలా కూర్చోలేకపోయింది. చటుక్కున లేచి హాండ్‌బాగ్ అందుకుని, చకచకా బయటకు నడచింది. వెళ్ళే ముందు అర్జంటుపని వల్ల రెండు గంటల ముందే వెడుతున్నాననీ - పర్మిషన్ గ్రాంట్ చేయమని వ్రాసి - ప్యూన్ చేతికిచ్చింది.

ఆమె మనసు మనసులోలేదు. ఛా! ఏం లోకం! ఆడదాన్ని గౌరవించలేని వాళ్ళు కూడా మనుషులేనా - ఆఫీసుల్లో పనిచేసే ఆడదంటే ఎందుకు వాళ్ళకింత అలుసు - స్త్రీ

స్వాతంత్ర్యం మీద ఉపన్యాసాలు యిచ్చే - ఈ మహానుభావులు - మళ్ళీ తమ భార్యల్ని వంట యిల్లు దాటి బయటకు రానీయరేం. ఇదేనా ప్రగతి? తనలాంటిదాన్ని అవమానించి వీళ్ళు ఆనందించేదేమిటి? తమ చెల్లెళ్ళకి, భార్యలకి యిలాటి అవమానం జరిగితే మళ్ళీ అదే వ్యక్తులు - ఆ అవమానాన్ని కూడా ఆనందించగలరా? ఎవడి కళ్ళలో చూసినా ఏదో కోరిక, తపన తప్ప యితర భావాలేవీ మచ్చుకైనా కనిపించవేం! ఆడదంటే ఒక్క కామానికేననా వీళ్ళ వుద్దేశ్యం! ఛీ -

ఆలోచనలు ఈగల్లా ముసురుతుంటే - భరించలేక తన యింట్లోకి అడుగుపెట్టింది శ్యామసుందరి - ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి - హఠాత్తుగా ఆగిపోయింది. తన కొడుకు బాబు మూడేళ్ళవాడు, నాలుగు చుట్టపీకలు - ముందు వేసుకు కూర్చున్నాడు. వాడి నోట్లోనూ ఒక చుట్ట వుంది - వాడి కోసం ఏర్పరచిన పనిపిల్ల తన మంచం మీద హాయిగా పడుకోని గుర్రుపెడుతోంది- తను అయిదింటిదాకా రాదనే ఆ పనిపిల్ల ధీమా. అందుకే అంత హాయిగా నిద్రపోతూంది. తీరిక దొరికింది గదా అని బాబు కూడా చుట్ట పీకలు ముందు వేసుకు కూర్చున్నాడు.

శ్యామసుందరి గబగబా ముందుకు నడిచి వాడి దగ్గర్నించి చుట్టపీకలు లాగి అవతల పారేసింది. వీపు మీద రెండు తగిలించింది.

వాడు గుక్కపట్టాడు - ఆ వూపులో పనిపిల్లకీ నాలుగు తగిలించింది శ్యామసుందరి. ఆఫీసు వదలకముందే వచ్చిన శ్యామసుందరిని చూసి బిత్తరపోయి నుంచున్నది పనిపిల్ల. అసలా చుట్టపీకలు అక్కడ వుండటానికి కారణం యింటి యజమాని జగన్నాథంగారు. ఆయన చుట్ట తాగుతూ తాగుతూ మధ్యలో ఆర్పివేసి - ఎక్కడ పడితే అక్కడ వదిలేసి వెడుతుంటాడు. శ్యామసుందరి కోపమంతా ఒక్కసారిగా జగన్నాథంగారి మీదకి మళ్ళింది.

ఉగ్రనరసింహ రూపంలో వచ్చిన శ్యామసుందరిని చూసేసరికి జగన్నాథంగారి నోట్లో చుట్ట దానంతట అదే జారి క్రింద పడింది. చదువుతున్న పేపరును ఒక ప్రక్కన పెట్టి ఆమెను వింతగా చూశాడు.

"మేమీ యింట్లో ఇంకా కొన్నాళ్ళు ఉండాలని వుందా మీకు?" సూటిగా అడిగింది శ్యామసుందరి.

ఆయన కొంచెం గాబరా పడ్డాడు. "ఏం జరిగిందమ్మా - అసలేమయిందని?" కూడ బలుక్కుని నెమ్మదిగా అన్నాడు.

"యింకా ఏం జరగాలండీ! మీరు దాచే చుట్టపీకలు - మావాడు తాగుతున్నాడు - వాడేమయినా యిక బాగుపడతాడా - అసలు మీ ఉద్దేశ్యమేమిటి?" -

"అయ్యో నిజంగా నా తల్లీ! - నాకు తెలీదు - పాపిష్ఠి మతిమరుపు - నాకదో దౌర్బల్యం - ఎంత జాగ్రత్త పడ్డా - చుట్టపీకలు అక్కడా - యిక్కడా పెట్టి మరచిపోతుంటాను- మానేద్దామనుకున్నా మానలేకపోతున్నాను!"

"నేనడిగేది మీ సంగతి కాదు - మావాడి సంగతి పసివాడు మీ మతిమరుపుకి విక్టిమ్

అవుతున్నాడు- దానికి మీ సంజాయిషీ అడుగుతున్నాను!'' విసురుగా అన్నది శ్యామసుందరి.

జగన్నాథంగారు తల వంచుకున్నాడు - ఒక క్షణం తర్వాత తల ఎత్తాడు. ఆయన కళ్ళల్లో నీళ్లు నిలవటం గమనించింది శ్యామసుందరి. గాద్గదిక కంఠస్వరంతో అన్నాడాయన ''నన్ను ఈసారి క్షమించు తల్లీ క్షమించు. పొరపాటు జరిగిపోయింది. పైకి చిన్నదిగా కనపడ్డా అది ఎంత తప్పో నాకు తెలుసు. నేనీరోజు నుంచీ చుట్ట త్రాగనని ప్రమాణం చేస్తున్నాను' ' దీనంగా చూశాడాయన. మనిషి బాగా నొచ్చుకుంటున్నట్టుగా కనపడ్డాడు.

శ్యామసుందరికి ఆయన నిలా చూసేసరికి ఏమనాలో తోచలేదు. ఒక క్షణం ఆయన వేపు తదేకంగా చూసింది. తనతో చక్కగా మనసు విప్పి మాట్లాడేది ఆయన ఒక్కడే! ఆయన పడక కుర్చీలో నించి లేచి చేతిలోని చుట్టను బయటకు విసిరేసి మళ్ళీ వచ్చి కూర్చున్నాడు. ఈసారి ఆమె పేపు సూటిగా చూశాడు.

''నన్ను క్షమించండి - ఏదో ఆవేశంలో ఏవేవో అన్నాను - ఇవాళ నా మనసేమీ బాగాలేదు'', నెమ్మదిగా అన్నది శ్యామసుందరి.

ఆయన అదోరకంగా నవ్వాడు. ''లేదమ్మా! నువ్వలా కసురుకోవటం వల్లనే - నా తప్పు నేను తెలుసుకోగలిగాను. నువ్వు చేసింది మంచే కాని చెడు కాదు. మంచి చేసినప్పుడు క్షమాపణ కోరటం అనవసరం! పైగా అర్థం లేదు కూడా ! నువ్వేమీ అనుకోకుండా వుంటానంటే ఒకటడుగుతాను చెప్పమ్మా. నీ మనసెందుకు బాగాలేదు? నేనడిగేది ఈ ఒక్కరోజు సంగతి కాదు - ఈ అయిదారు నెలల నుంచి నిన్ను గమనిస్తూనే వున్నాను. ఏదో పోగుట్టుకున్నదానిలా - దేనికోసమో వెదుకుతున్న దానిలా కనబడుతున్నావ్ నా కళ్ళకి - అదీగాక - నేను ఆ నోటా, ఈనోటా నీ గురించి చాల వింటున్నాను - మంచో, చెడో నాకేదీ అవసరం లేదు. నువ్వు మా యింట్లో అద్దెకి వుంటున్నావ్ - అద్దె సరిగ్గా యిస్తున్నావ్. మిగతా విషయాలు నాకు అనవసరం. కాని ... కాని... యివాళ సందర్భం వచ్చింది కనుక అడుగుతున్నాను - అసలు నీ హృదయమంతగా దెబ్బతినటానికి కారణం ఏమిటి? నీకు చెప్పటానికి అభ్యంతరం వుంటే చెప్పకు - ఏదో పెద్దవాడిని నా చేతనయిన సహాయం నీవవసరమనుకుంటే - నే చేయగలిగితే చేద్దామనే తప్ప వేరే ఉద్దేశ్యంతో అడగటంలేదు.'

అదో రకంగా నవ్వింది శ్యామసుందరి.

''బాబాయ్‌గారూ. నా గురించి మీరేమీ తెలుసుకోనవసరం లేదు. మీరిప్పటిదాకా ఏమయినా తెలుసుకుని వింటే - నమ్మాలని వుంటే నమ్మండి - లేకపోతే లేదు. కాని ఒక విషయం చెప్పదలుచుకున్నాను. స్త్రీని గౌరవించటం తెలియని మగవాళ్ళు విచ్చలవిడిగా వున్నారు మన చుట్టూ. ఆడదంటే ఒక వంటింటి కుందేలని, ఆమె జీవితం యింటికే పరిమితమనీ, స్త్రీ భర్తకూ - పిల్లలకూ సేవచేసే దాసి మాత్రమేననీ. ఆడదాన్ని కాలి కింద తొక్కిపెట్టటమే శ్రేయమని నమ్మే ఈ మగజాతి, ఆడదానికి ఒక ఆలోచించే హృదయముంటుందనీ - ఆమెకీ జీవితంలో అన్నిరకాల అనుభవాలనూ మగవాడితోపాటు సమానంగా అనుభవించాలనే కోరిక ఉంటుందనీ తెలుసుకోలేదు. ఎంతసేపటికీ తమ ఆధిక్యతను చూపించుకోవటమే కాని, ఎదుటి వారిని గౌరవించటం తెలియని మీ మగజాతి

అంటే నాకు అసహ్యం. ఇవాళ ఆఫీసులో ఏదో నావల్ల తప్పు జరగబట్టే ఆఫీసర్ తిట్టాడు. కాని మనిషిగా పుట్టినందుకు ఒక సభ్యత, సంస్కారం ఉండొద్దూ! ఆడవాళ్ళని తన ఆఫీసులో వద్దని చెప్పినా పై అధికారులు వినక తన ప్రాణాలు తీస్తున్నారట. అదేనా అయన సంస్కారం?

అదేనా ఎదుటి మనిషికి యివ్వవలసిని గౌరవం? తమ చెల్లెళ్ళలాటి ఆడపిల్లలను తిడుతుంటే మిగతా జనం చూపించవలసిన సానుభూతి, అంత అసహ్యంగా వుండటానికి కారణం నేను పరాయి ఆడదాన్ననేగా కళ్ళతో నన్ను నమిలి మింగేలా ఆకలి చూపులుచూసే మిగతా క్లర్కులకీ మాత్రం ఎక్కడనుంచి వస్తుంది సంస్కారం? యధారాజా - తథాప్రజ- స్త్రీని గౌరవించలేని ప్రజ, దేశం ఇక ఏ సంస్కృతి కోసం పాటుబడాలి? అందుకే పురుషజాతి అంటే నా కదోవిధమైన అసహ్యం ఏర్పడుతున్నది. అందుకే మా ఆయనకు విడాకులు కూడా యిచ్చాను'' ధైర్యంగానే ఆ మాటలు అన్నా ఆమె కళ్ళలో సుడులు తిరిగిన నీరు అతిశయం కోసమో సభ్యత కోసమో - బయటకు మాత్రం రానని మారాం చేసింది. ఆ విషయం జగన్నాథంగారు గమనించకపోలేదు.

ఒక క్షణం ఆగి అన్నారు - ''అమ్మాయ్ శ్యామసుందరీ! నువ్వు సరిగ్గా అర్థం చేసుకోలేదమ్మా! కొంతవరకు నువ్వు చెప్పిన మాటలూ సత్యదూరం కావు మగవాళ్ళలో స్వార్థపరులూ, స్త్రీని గౌరవించలేనివారు వున్నమాట నిజమే కాని ఏ ఒక్కర్నో, యిద్దరినో పట్టుకుని, అదే మగజాతి కంతటికీ అన్వయించటం వివేకుల లక్షణం కాదు. మీ ఆఫీసరూ, ఆఫీసులోని మిగతా వాళ్ళ సంగతీ చెప్పావ్ - అటువంటి అప్రాచ్యులు ఇక్కడే కాదమ్మా ప్రపంచంలో అన్నిచోట్ల వున్నారు. అలాటి నీచులకు బుద్ధి చెప్పవలసిన అగత్యం ఎంతయినా వుంది. అదీ నీలాటి వారివల్లే జరగాలి. కాని నువ్వు - నువ్వే కాదు నీలాటి వారు కూడా తప్పుదోవ పడుతున్నారు. సాధించవలసిన విధానం యిలా పురుషద్వేషంతో కాదమ్మా - ''ఎంతటి శత్రువునయినా మంచితోనే జయించాలి ద్వేషంతో కాదు'' అన్నాడు మహాత్ముడు! ఇప్పుడు నీలో తీవ్రమైన అసంతృప్తి పెరిగిపోయింది. ఒక విషయం చెప్పమ్మా - సమానత్వం, సమానత్వం అనటమే కాని అసలా సమానత్వం అంటే ఏమిటి అది ఇప్పుడు స్త్రీలలో ఏ రంగంలో లేదో చెప్పు?''

శ్యామసుందరి సన్నగా నవ్వింది. ''చాల ఎక్కువగానే చెప్పారు. ఒకే తల్లి కడుపున ఒక అబ్బాయి ఒక అమ్మాయి పుడుతున్నారు. పదిహేను, యిరవై సంవత్సరాల దాకా తల్లిదండ్రులు యిద్దరినీ ఒకేరకంగా పెంచుతున్నారు. తరువాత అబ్బాయిని ఇంకా పెద్ద చదువు చదివించి గొప్పవాడిని చేద్దామనుకుంటున్నారు. కాని అమ్మాయిని వచ్చిన చదువుతో తృప్తిపడమి చెప్పి ఎవడికో అంటగట్టి ఎంత తొందరగా వదుల్చుకుందామా అని చూస్తున్నారు. అదేనా సమానత్వం? కొడుకు కట్నంగా పది వేలు తెస్తున్నాడు. కూతురికి పది వేలు కట్నంగా యివ్వాలి. అదేనా సమానత్వం? పోనీ పది వేలు తీసుకుని పెళ్ళి చేసుకున్న ఆ యువకుడు ఆమెను సమానంగా గౌరవించగలుగుతున్నాడా? వంటింటికే ఆమె జీవితం అంకితంచేసి కాలి కింద తొక్కిపడుతున్నాడు. అదేనా సమానత్వం? అతిశయం కోసం పది మంది ఎదుటా

'ఎగ్జిబిట్' చేయటానికే పెళ్ళాం. భార్య కాని లేకపోతే బానిసే? ఖర్మ వశాత్తూ భార్యా-భర్తలకు మాటామాటా వస్తే ఆమె పుట్టింటికి పోవలసిందే! ఆమె వయసూ, మనసూ అలా హరించుకుపోవలసిందే! కాని అతనికేం లోటులేదు! "మగమహారాజు" అంటుంది లోకం! అదేనా సమానత్వం ! సంకుచితమయిపోయిన ఈ సంఘంలోనా సమానత్వం!" ఛీత్కారం చేసింది శ్యామసుందరి.

జగన్నాథంగారు నిర్మలంగా నవ్వారు. "చాల ఆవేశంగా అన్నావ్ తల్లీ! నువ్వు చెప్పిన వ్యక్తులు పూర్వకాలంలో వుండేవారు - ఆ కాలం అటువంటిది - తరువాత సంఘసంస్కర్తలు బయలుదేరారు - స్త్రీ జాతి ముందుకు అడుగువేసింది. ఇప్పుడు ఏ రంగంలో చూసినా పురుషులతో పాటు స్త్రీలూ కనబడుతూనే వున్నారు. ఏది ఏమయినా ప్రకృతిరీత్యా స్త్రీ అబల. ఆమెకు కొన్ని లోపాలను, నువ్వేమంటావో ఆ మాటని... పోనీ ప్రత్యేకతలను... అవి వున్నయ్ ఒక రాత్రి సుఖాన్ని స్త్రీ పురుషులు యిద్దరూ సమానంగా అనుభవిస్తారు - కాని స్త్రీ తరువాత పదినెలలు బాధపడాలి. ప్రాణానికి కూడా ఒక్కొక్కపుడు ప్రమాదముందని అన్నా తప్పు కాదనుకుంటాను. కాని పురుషురు ... ఇందాక నువ్వన్నట్టు 'మగమహారాజు'లా వుంటాడు. నేనేదో పురుషుల తరఫున వకాల్తా పుచ్చుకొన్నాననుకోకు. వయసు ముదురుతున్నది, నాకు జీవితం నేర్పిన అనుభవాల ద్వారా చెబుతున్నాను. ఈ విషయంలోనే సమానత్వం లోపిస్తున్నది. పోనీ అది మన చేతిలో లేదు - సంకుచితత్వం, సంకుచిత స్వభావులు యిక్కడే కాదమ్మా ప్రతిచోట, ప్రతిదేశంలోనూ వుంటారు. సంస్కారవంతులతోపాటు సంకుచితులూ, సన్మార్గులతోపాటు దుర్మార్గులూ, పుణ్యాత్ములతోపాటు పాపాత్ములు, మంచితోపాటు చెడు, ప్రతిచోటా కనపడేదే! కాని మొదటి వారి మీదే దేశ సంస్కృతి సంస్కారమూ నిలబడి వున్నయ్. కాని రెండవ వారి మీద కాదు. ఒక విషయం విను - భారతదేశంలో స్త్రీకి వున్న గౌరవం, చాల పటిష్టమయినది. ఆదే భావంతో విదేశీయులు కూడా స్త్రీలను గౌరవించటం నేర్చుకుంటున్నారు. కాని బహుశా నీకు తెలిసిన విషయమేనేమో ఒక విషయం జ్ఞప్తికి తెస్తున్నాను! కుటుంబానికి గౌరవం తెచ్చినా, అప్రతిష్ట తెచ్చినా ఒక్క స్త్రీయే తేగలదు! ఆడవారు చదువుకుంటున్నారు, పైకి వస్తున్నారు బాగానే వుంది. ప్రేమించి మనసుకు నచ్చినవాడినే వివాహం చేసుకుంటున్నారు - అదీ బాగానే వుంది. కాని అదివరకు లేని విడాకులు యిప్పుడు వచ్చినయ్ ... పూర్వకాలపు పిల్ల ముక్కూ, ముఖం ఎరుగనివాడిని వివాహమాడి సుఖపడితే, ఈనాడు అన్నీ తెలిసి మనసుకు నచ్చినవాడినే వివాహమాడిన పిల్ల విడాకులు యిస్తున్నది! సమానత్వం, సమానత్వం అంటూ మహిళా ప్రపంచం ముందుకు వచ్చింది బాగానే వుంది. సమానంగానే నడుస్తున్నారు. అదీ బాగానే వుంది. కాని అడది అన్న తర్వాత కొంత. ఎంత సమానత్వం వున్నా - జాగ్రత్త అవసరం తల్లీ. యిప్పుడు కొందరు సొసైటీ గర్ల్సనీ, మరీ పెద్దపెద్ద పదవుల్లో వున్న వారినీ చూస్తూనే వున్నాం. అక్కడ నీతికి స్థానమున్నదా ? అడది ఆడదిలాగా ప్రవర్తిస్తున్నదా? కట్టుకున్న భర్త ఎదురుగానే యింకొకనితో డాన్స్ చేస్తుందేం? తప్పతాగి మత్తుగా పడుకుంటున్నదేం? యింట్లో పిల్లల ధ్యాసకన్నా ఆమెకి తన సరదాలే ముఖ్యమనుకుంటున్నదేం? భారత స్త్రీకి శీలం, సహనం

ముఖ్యం అని గర్వంగా చెప్పుకొనే స్థితిలోనించి మనం ఎందుకు దిగజారాలి! అది సమానత్వమా! ముసలివాడిని - మన్నించు తల్లీ నేనేదో ఆవేశంతో అంటున్నాను. నేనిది కొంతమందిని వుద్దేశించి మాత్రమే అంటున్నాను. దేశంలో అంతా అలాటి వారని నేననను. ఎలాగయితే కుత్సితులూ, సంకుచితులు అయిన భర్తలుంటున్నారో, అలాగే భర్తలను వంచించి, కులికే నారీమణులూ ఉన్నారు. మొదటి విషయంలో భర్తను మార్చగల సంస్కారం, తెలివి తేటలూ స్త్రీకి ఎంత అవసరమో, రెండవ విషయంలో భార్యను అదుపులో పెట్టవలసిన తెగువ, ధైర్యమూ మగవాడికి అంతే అవసరం! అంతేకాని వ్యక్తిపరంగా వున్న ఏ విషయాన్ని మొత్తం జాతికే అంటగట్టకూడదు తల్లీ!''

శ్యామసుందరి వెంటనే అన్నది - ''సరే మీరు చెప్పిందీ బాగానే వుంది! కాని భార్యాభర్తలకి మాట మాట వచ్చి అపార్థాలు జరిగితే ఒకరంటే ఒకరికి పడక జీవచ్ఛవాల్లా జీవితం సాగించటమే వివేకుల లక్షణమంటారా? లేక యిద్దరూ విడిపోయి తమకీసారి ఇష్టమయిన వారినే చేసుకుని సుఖపడటం నయమంటారా? ఒకరి కోసం యింకొకరు తమ సుఖాలనెందుకు కాదనుకోవాలి!''

జగన్నాథంగారు నవ్వారీసారి.

''బయట పడిపోయావ్ అమ్మాయ్! భార్యాభర్తలకి మాటా మాటా వచ్చి, అపార్థాలు జరిగితే ... అన్నావ్ ! అపార్థం అని తెలిసి సరిగ్గా అర్థం చేసుకుని సుఖపడలేని ఈ చదువులూ, సంస్కారాలూ మాత్రం ఎందుకు? చిన్నచిన్న కలహాలు సంసారంలో రావటం సహజమే! పైగా వాటిల్లో ఒక ఆనందం కూడా వుంది. ఒకవేళ అవే పెద్ద పెద్ద కలహాలైనా భార్యాభర్తలిరువురూ చదువు సంస్కారం వున్నవాళ్ళే కనుక చక్కగా చర్చించి సామరస్యం కుదుర్చుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఒకవేళ అదీ ఎంతకీ కుదరకపోతే యిద్దరూ చెరో మెట్టూ క్రిందికి దిగుతే అంతా పరిష్కారమయిపోయింది. అంతేకాని విడాకులనే దానికి అర్థంలేదమ్మా! మా ఆవిడ పది రోజులు పెంచిన కుక్కపిల్ల పారిపోయిందని ఎన్నో నెలలు బాధపడింది! మద్రాస్ నుంచి రైల్లో సరదాగా మాట్లాడిన మిత్రుడు బెజవాడలో మనల్ని వదలివెళ్ళిపోతుంటే వెళ్ళిపోతున్నాడే అనిపిస్తుంది. అలాటిది కొన్ని సంవత్సరాలు కాపురం చేసిన భార్యాభర్తలు విడిపోవటమా! విడిపోయి వేరు పడినా, ఆ మమతల బంధం నుంచి విముక్తులవటం ఏమీ తేలిక కాదు తల్లీ! నా భార్య చనిపోయి పదేళ్ళయినా, ఎప్పుడూ మనసులో మెదులుతూనే వుంటుంది. విదేశాల్లో భార్యలు భర్తల్ని, భర్తలు భార్యల్నీ దుస్తులు మార్చినంత త్వరగా మార్చవచ్చు. అది వాళ్ళ 'సంస్కృతి'. అది వాళ్ళ 'సంస్కారం' . అందుకే వాళ్ళలో చాలామందికి మమత, మానవత్వం లోపిస్తున్నది. కన్నతల్లిని కాల్చటానికి వెనుదీయడు కొడుకు! దాన్నే వాళ్ళు 'ఎడ్వంచర్' అని కూడా అంటారు! అది మన దేశంలో సరిపడదమ్మా - సరిపడదు. మన దేశంలో మొదటి నుంచీ మమతలకీ, మానవత్వానికీ పుట్టినిల్లు, యిప్పుడింత దౌర్భాగ్యంగా తయారవుతున్నదీ అంటే కారణం. ఈ విదేశపు అనుకరణలే తప్ప యింకేమీ కాదు తల్లీ! విడాకులంటే ఏదో వస్తుమార్పిడిలాగా తయారయింది. అంతెందుకు నువ్వు చెప్పమ్మా! నీ భర్తను నువ్వు విడాకులు యిచ్చిన మరుక్షణమే

మరచిపోగలిగావా? నీ భర్త రక్తం, పోలికలు జీర్ణించుకుపోయిన నీ కొడుకుని స్పర్శించినప్పుడయినా నీకు నీ భర్త గుర్తుకు రావటం లేదూ? లోకానికి నువ్వు భయపడవు. భయపడవద్దనే నేనూ చెబుతాను. కాని రేపు నీ కొడుకు 'అమ్మా నాన్న ఏడి?' అని అడిగితే జవాబు చెప్పటానికి సిద్ధపడ్డావా?.... ఆగారాయన. సూటిగా శ్యామసుందరి కళ్ళలోకి చూశాడు.

ఆమె తల వంచుకున్నది. ఒక్క క్షణం ఆగి తల ఎత్తింది. "మళ్ళీ పెళ్ళి చేసుకోవటం తప్పుకాదే"! అన్నది నెమ్మదిగా.

"తప్పుకాదు కాదని నేనూ అనను. విడాకులు తీసుకున్న మరుక్షణంలో మనసురీత్యా ఏమోకాని చట్టరీత్యా నీకు ఆ హక్కు కూడా వున్నది. మళ్ళీ పెళ్ళి చేసుకోవటం తప్పు కాదనే అంటున్నావు కాని, గట్టిగా మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను అనవేం?"

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"అది నువ్వు అన్నంత, పుస్తకాల్లో రాసినంత సులభం కాదు తల్లీ! నీ మనసు ఒప్పుకోదు. మానవత్వమన్నది ఏ మూల వున్నా నువ్వామాట అనలేవు! నీలోనూ ఒక 'బలహీనత' ఉంది. ఎంత మొండిగా అసంతృప్తితో, ఏదో కావాలనే తహతహతో సుఖాన్ని జీవితం నుంచి వేరుచేసుకుంటున్న నీలో ఉన్న ఆ 'బలహీనత' మానవత్వమే నంటాను నేను! అందుకే నువ్వామాట అనలేకపోతున్నావ్. ముఖ్యమయిన కారణం యిదే అయినా యింకా చిన్న అడ్డంకులు లేకపోలేదు తల్లీ! కొన్నాళ్ళు భర్తతో కాపురం చేసి విడాకులు యిచ్చిన స్త్రీని, అందులోనూ, ఒక పిల్లవాడు కూడా వున్న స్త్రీని వివాహం చేసుకుంటానికి ముందుకు వచ్చేటంత సంస్కారవంతుడు వుంటాడని నేను అనుకోను. ఒకవేళ వున్నా అతన్ని వివాహమాడినా మళ్ళీ అతనితో కూడా అపార్థాలు రావని గ్యారంటీ లేదు. అసలు అసంతృప్తి అన్నది రానేకూడదు కాని వచ్చిన తర్వాత దానికి అంతు అనేది ఉండదు. నిన్ను అంటున్నానని నన్ను నిందించకు అమ్మా నేను లోకసహజమైన సంగతులు చెబుతున్నాను. తరువాత అతనితోనూ ఆ స్త్రీ సుఖపడకపోవచ్చును! ఆ రకంగా అది ఎక్కడ అంతం అవుతుందో చెప్పలేము. దానికి ఒకటే మార్గం వుంది - అదే సమస్యని జాగ్రత్తగా పరిశీలించి పరిష్కారం చేసుకోవటం. అప్పుడే అందరికీ ఆనందం, అది మొదటే చేస్తే, అసలు విడాకుల ప్రశ్నే ఉండదు, ఏమంటావ్!

శ్యామసుందరి మాట్లాడలేదు ఏదో ఆలోచిస్తున్నది. ఆమె ముక్కుపుటాలు అదురుతున్నయ్! పెదవులు వణుకుతున్నయ్!

కొంచెం సేపటికి మెల్లగా అన్నది "మీరు చెప్పింది అంతా నిజమే ... కాని... కాని... ఆయన .... ఆయన పద్ధతులేమీ నాకు నచ్చలేదు -"

ఆయన శ్యామసుందరి తల మీద చేయి వేసి ఆప్యాయంగా నిమిరాడు. "అసలేం జరిగిందో చెప్పమ్మా! నేను చేతనయిన సహాయం చేస్తాను!" అన్నాడాయన.

శ్యామసుందరి కనుకొనుకులలో నిలచిన నీటిని తుడుచుకున్నది - "మీతో చెబితేనే కాని నాకు తృప్తిగా వుండదు! పెళ్ళయిన రెండు, మూడు సంవత్సరాలు ఆయనా నేనూ చాల

ఆనందంగానే గడిపాము. నేనంటే ఆయన ప్రాణం పెడతారు. ఆయన నన్నూ, నా భావాల్నీ గౌరవించేవారు. ఫలితంగా నేనూ వుద్యోగం చేసి నెలకి రెండు వందలు తెచ్చేదాన్ని. పిల్లాడు పుట్టిన తరువాత సంవత్సరానికి మొదలయింది అసలు గొడవ.

మా అత్తగారు పోయారు ఆ సంవత్సరమే. దాంతో నేనూ, ఆయన, బాబూ మాత్రమే యింట్లో వుండేవాళ్ళం. ఆయనటు, నేనిటు ఆఫీసుకి వెడితే బాబుని చూసేవాళ్ళుండరని ఆయన వుద్దేశ్యం. నేను అలా కాదని ఒక పనిపిల్లను ఏర్పాటు చేశాను. ప్రొద్దున నేను ఆఫీసుకి వెళ్ళినప్పటి నుంచీ, సాయంత్రం మేము వచ్చేదాకా బాబుని పనిపిల్ల చూస్తూ ఉండేది. ఆయన ప్రొద్దున ఎనిమిది గంటలకే ఫ్యాక్టరీకి వెళ్ళి సాయంత్రం ఆరింటికి వచ్చేవారు. ఇద్దరం కలిసి ఏడొందలపైనే సంపాదించే వాళ్ళం. హాయిగా కాలం గడిచేది. కొన్నాళ్ళ తర్వాత ఆయన మారిపోయారు. ఉద్యోగం మానేయమనీ, పిల్లవాడి సంరక్షణ చేయమనీ, యింటిపట్టునే వుండమని నన్ను వేధించుకు తినేశారు. నేను ఆయన మాటలు లక్ష్యపెట్టలేదు. కారణం నాకలా యింటిపక్షిలా ఉండటం యిష్టంలేకనే! అదే అయనతో అన్నాను. సణుక్కునేవారు. తరువాత కొన్నాళ్ళ దాకా ఆ విషయం మీదనే మాటామాటా వచ్చింది. ఆయనకి నా మీద వున్న ప్రేమ రాత్రి పూటే కాని యింకే సమయంలోనూ లేదని గ్రహించటానికి ఎక్కువ రోజులు పట్టలేదు! అంత సంస్కారమున్న మనిషీ ఎందుకో ఒక్కసారిలా మారిపోయారు. నన్ను ఉద్యోగం మానేయమని బ్రతిమిలాడటం మానేసి, కసురుకోవటం మొదలుపెట్టారు. నోటికొచ్చినట్టు తిట్టారు. నేను ఎదురు తిరిగాను. ఆయన యిక లాభం లేదనుకొన్నారో ఏమో నోరెత్తలేదు. ఆ రోజునుంచీ నాతో సరిగ్గా వుండేవారు కారు. ఒక్కరోజయినా మనసు విప్పి మాట్లాడేవారు కారు! ఒక బానిసకన్నా హీనంగా చూసేవారు. నాకూ ఆయనంటే విరక్తి పుట్టింది. అదే ఒక రోజు ఆయనతో అన్నాను. ఒక్కసారిగా ఆశ్చర్యపోయారాయన. కాని ఏమి మాట్లాడలేదు. నేను ఆయనకి ఎందుకు విడాకులిస్తున్నానో వివరంగా చెప్పాను. "ఇదే నీ చివరి నిశ్చయమా - బాగా ఆలోచించుకున్నావా! అని అడిగారు. "ఆరు నూరయినా, నూరు ఆరయినా నా నిశ్చయం యింతే!" అని గట్టిగా చెప్పాను. ఆయన నన్ను వద్దని బ్రతిమిలాడలేదు. కాసేపు ఆలోచించి "మరి బాబు?" అన్నారు. "నా దగ్గరే వుంటాడు!" అన్నాను.

కొంచెంసేపు ఆగి", సరే నీ దగ్గరే వుండనీ మన పోట్లాటలలో పిల్లవాడు నలిగిపోవటం దేనికి? కాని ఒకటి మాత్రం గుర్తుంచుకో - పిల్లవాడికి ఏ విధమైన అన్యాయం జరిగినా నేను సహించలేను. వాడు నీ కొక్కదానికే పిల్లవాడు కాదు వాడి మీద నాకూ అధికారముంది?' అన్నారాయన.

నేను మాట్లాడలేదు. విడాకుల పత్రం మీద సంతకం కావాలన్నాను.

"అది అనవసరం. నేను మళ్ళీ పెళ్ళిచేసుకోవాలనుకుంటే కదా ఆ పత్రం అవసరం. నేనిక ఎవర్ని పెళ్ళిచేసుకునేది లేదు. మనం మామూలాగానే విడిపోదాం!" అన్నారాయన ఎటో చూస్తూ.

"మీకు అవసరం లేకపోవచ్చు - కాని నాకవసరం! నేనెవర్నయినా వివాహం

చేసుకోవాల్సి వస్తే అది నాకు కావాలి'' అన్నాను.

ఆయన నావేపు అదోలా చూశారు. ఆ చూపులో బాధే వుందో, కోపమే వుందో, ఆశ్చర్యమే వుందో నాకు తెలీదు చటుక్కున నా దగ్గరకు వచ్చారు. ''సరే నీ యిష్టం వచ్చినట్టు కానియ్!'' అన్నారు నంతకం పెట్టటానికి యిష్టపడుతూ.

'అంతే మళ్ళీ ఆయన్ను కలువలేదు. ఎంతో చదువుకున్న వారనీ, సంస్కారవంతులనీ ఆయన్నే కావాలని పెళ్ళి చేసుకున్నాను. కాని ఆయన సంస్కారం భార్యని గౌరవించటంలోనే తెలిసిపోయింది. అందుకే ఆయన నా జీవితంలోనించి దూరమవటమే నాకిష్టమయింది'.

తల ఎత్తింది శ్యామసుందరి చెప్పటం ఆవి. ఆమె పైకి మొండిగా వున్నా లోపల చాల బాధపడుతున్నట్టు ఆమె కనుల ద్వారా స్పష్టంగా గ్రహించగలిగారు జగన్నాథంగారు.

తరువాత ఆమె ఆరోజు ఆఫీసులో జరిగిన అవమానాన్ని కూడా చెప్పింది. చెబుతూ చెబుతూ ముఖాన్ని చేతుల్లో దాచుకుని విలపించింది. జగన్నాథంగారు అంతా సావధానంగా విని ఒక్క నిముషం ఆలోచించాడు.

''నేనోమాట చెబుతాను తల్లీ వింటావా? మీ తండ్రిలాటి వాడిని. పరిస్థితి పూర్తిగా అర్థం చేసుకుని చెబుతున్నవాడిని. నేచెప్పేదంతా జాగ్రత్తగా విను. నీ మనసుకి నచ్చితేనే నేను చెప్పినట్టు చేయి. నువ్వు బాగా చదువుకున్నదానివి, తెలివిగల దానివి కనుక చక్కగా ఆలోచించే ఒక నిర్ణయానికి రా !'' అంటూ ఆమె వేపు ఆదరంగా చూశాడు.

ఆమె తల వూపింది అదో రకంగా.

''తప్పంతా నీదేనని అంటున్నాను నేను!'' అన్నాడాయన స్పష్టంగా ఒక్కొక్క అక్షరాన్నే వత్తి పలుకుతూ!

ఆమె ఆశ్చర్యంతో కళ్ళు విప్పార్చి చూసింది!

''అవునమ్మా! నేనంతా చెబుతానునిర్మలమైన మనస్సుతో విను. చక్కగా అర్థం చేసుకో! నీ భర్తకు నీచేత ఉద్యోగం చేయించడంలో తప్పేమీ కనపడటం లేదని తెలుస్తునే వుంది. నిన్ను మొదట రెండు సంవత్సరాలు - పిల్లవాడు పుట్టిన తర్వాత కూడిన వుద్యోగం చేయనిచ్చాడు కనుక, తరువాత నిన్ను వుద్యోగం చేయవద్దన్నాడు ఎప్పుడు? మీ అత్తగారు పోయిన తర్వాత. ప్రొద్దున ఎనిమిది గంటలకు వెళ్ళి సాయంత్రం ఆరు దాకా రాడు నీ భర్త. నువ్వు సాయంత్రం అయిదు గంటలకు కాని యింటికి రావు. అలసిసొలసి యింటికి వచ్చిన నీ భర్తకు అలసిపోయిన నువ్వు యిచ్చే స్వాగతం సహజంగా రుచించదు. కాని నిన్ను అభ్యంతర పరచడం యిష్టంలేకనే ఎలాగో వూరుకున్నాడు. అయినా సమయం ఉన్నంతలో యిద్దరూ హాయిగా జీవితాన్ని అనుభవించడం నేర్చుకున్నారు. బానేవుంది - కాని యింట్లో పిల్లవాడికి సంరక్షణ చేసే అత్తగారు పోవటం వలన నువ్వొక పనిమనిషిని కుదిర్చావు. అది ఆయనకు యిష్టం కాలేదు! కారణం పిల్లవాడి పెంపకం విషయంలో అజాగ్రత్త జరుగుతుందనే! అందుకే నిన్ను ఉద్యోగం మానేసి యింటి పట్టున వుండమన్నాడు. మగవాడికి అడది చేయవలసిన ధనసహాయం ఉద్యోగం చేసి సంపాదించటం కాదు. ఉన్నంతలో చక్కగా

అమర్చి, వచ్చే డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేయటం. అదే మీ ఆయన కోరింది! అంతేకాదు పనిపిల్ల పెంపకంలో పెరిగిన వాడు ఏనాటికి కన్నతల్లి పెంపకంలో పెరిగిన పిల్లవాడికి సమానుడు కాడు. ప్రొద్దుటి నుంచీ సాయంత్రం వరకు పనిపిల్ల చేతిలో నీ పిల్లవాడు ఏ రకంగా పెరుగుతున్నాడో నీకు తెలుసు ! పిల్లల పెంపకంలో వహించవలసిన బాధ్యత యింతా- అంతా కాదని నీకు తెలుసు! పసివయసులో ఆ చిన్నారి హృదయంలో ఏ భావాలు ముద్రించబడతాయో, అవే పెరిగి పెద్దవయి అతని వ్యక్తిత్వానికి బాసటగా నిలుస్తాయని నేను వేరే చెప్పనవసరం లేదు అంతదాకో ఎందుకు - ఇవాళ నీ పనిపిల్ల అక్కడ చేసిందేమిటి? పిల్లవాడ్ని వాడి యిష్టానికి వదిలేసి తను హాయిగా నీ మంచం మీదే నిద్ర పోతున్నది. పిల్లవాడు నువ్వు వచ్చేసరికి ఏం చేస్తున్నాడు? హు ! ఇవాళ తొందరగా రాబట్టి ఈ విషయం నీ కంటబడింది కాని మామూలు వేళకే వస్తే ఈ రోజు కూడా రోజు లాగానే పనిపిల్ల పిల్లవాడితో నవ్వుతూ కనిపించేది! జరుగుతున్న విషయం ఏనాటికైనా కనిపెట్టగలిగే దానివా? అందుకే నీ భర్త ముందే అన్ని వూహించి నిన్ను యింటి పట్టునే వుండమన్నాడు! అది తప్పంటావా?

"ఇక నీ భర్త నిన్ను తిట్టడం, కసురుకోవటం ప్రారంభించాడన్నావ్! నువ్వు అతనికి ఎంత విసుగూ, కోపం కలిగేలా ప్రవర్తించకపోతే అతనలా తయారవుతాడు! పోనీ ఏదో కోపంలో అలా అన్నాడనుకుందాం! నువ్వు సంపాదించే రెండు వందల రూపాయల కోసమని, మీ ఆఫీసర్ నిన్నివాళ ఎన్ని చీవాట్లు పెట్టినా భరించావు కాని రూపాయలతో విలువ కట్టలేని ఆప్యాయతనీ, ఆదరణనీ చూపిస్తున్న భర్త కోపంతో కసురుకుంటే భరించలేక పోతున్నావ్! అదేదో స్త్రీ జాతికే అవమానంలా, బాధపడిపోతున్నావ్! దీనికి కారణం నీలో పెరిగిన అసంతృప్తి కాక మరేమిటి? నీ భర్త భార్య అంటే ఒక్క కామానికే అనుకుంటున్నాడనీ అన్నావ్! సంసార జీవితానికి కామమొకటే కాదు వుండవలసింది, కామం కూడా వుండాలి! మీ ఆఫీసులో అడ్డమైన వాళ్ళూ వెకిలిచూపులు చూస్తున్నా భరించి ఉద్యోగం చేయగలుగుతున్న దానివి తాళి కట్టిన భర్త లాలించి దగ్గరకు తీసుకుంటే నీకు ఎబ్బెట్టుగా వుందా? నువ్వు ఎంత అన్యాయమయిపోతున్నావో నీకు తెలియటం లేదు తల్లీ! ఆలోచించు - బాగా ఆలోచించే ఒక నిశ్చయానికిరా ! నేను ఏదయినా నోరు జారితే మన్నించు! కాని విషయం మాత్రం వివరంగా అర్థం చేసుకో!"

ఆమె నెమ్మదిగా తల ఎత్తింది. ఆయన వేపు ఒక క్షణం చూసి తల దించుకుంది. కాసేపు ఏమీ మాట్లాడలేదు.

"నీ నిశ్చయం నాతో చెప్పటానికి అభిమానంగా వుంటే చెప్పనవసరం లేదులే అమ్మా! కాని నువ్వు సర్గిగ్గా ఆలోచించి, చక్కని నిర్ణయానికి వస్తే అదే సంతోషం" మెల్లగా అన్నారాయన.

ఆమె తల దించుకునే చిన్న కంఠ స్వరంతో మెల్లగా అన్నది - "లేదు బాబాయిగారూ! నేను ఎంత అజ్ఞానంలో వున్నదీ గ్రహించాను! కాని... కాని.... " ఆమె ఆగింది.

"ఏమిటమ్మా యింకా సందేహిస్తున్నావ్?" లాలింపుగా అడిగాడాయన.

తటపటాయిస్తున్నదామె.

"ఏమీలేదు ఆయన్ని కాదని విడాకులు కూడా తీసుకొని వచ్చాను నేను. అడిగినా ఆయన నన్ను యిప్పుడు స్వీకరించరు. నేనంటే ఆయనకు ఒక అసహ్యమయిన భావం ఏర్పడి ఉంటుంది.

ఆయన చిన్నగా నవ్వాడు.

"అక్కడే పొరపడ్డావ్ తల్లీ! అతని ప్రవర్తనని తరచిచూస్తే నాకలా అనిపించదు! విడాకుల పత్రం మీద అతనికి ఇష్టం లేకపోయినా, కేవలం నీ కోసమే సంతకం పెట్టాడు. అతనికి మళ్ళీ పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యమే లేదని అతని మాటల వల్ల స్పష్టంగా తెలుస్తున్నది. పైగా అతనికి నిన్ను విడిచి వుండటమే యిష్టంలేదు! అయినా నువ్వు అంత అవివేకంగా అడుగుతూ పైగా అతన్నే నిందిస్తుంటే తప్పనిసరిగా నీ విడాకులకి సమ్మతించాడు. కారణంం నువ్వు కోర్టుకి వెళ్ళటానికైనా సిద్దపడతావని నీ ప్రవర్తన అనిపించటం వల్లనే! నువ్వూ, నీ సుఖం అక్కర్లేదనుకుంటే, ప్రాణప్రదంగా ప్రేమించే కొడుకుని నీకు వదలక అతనే కొడుకుని దగ్గర వుంచుకుని పెంచుకునేవాడు. కాని నిన్ను నిరుత్సాహపరచటం అతనికి ఏ మాత్రం యిష్టంలేకనే అందుకూ ఒప్పుకున్నాడు. అతనే మాత్రం వివేకవంతుడైనా నిన్ను స్వీకరిస్తాడమ్మా! అతనికా వివేకం ఉందనే నా నమ్మకం - వెళ్ళు, నీ యింటికి - అన్నీ మర్చిపోయి దర్జాగా వెళ్ళు. అతనేమీ అనకపోగా, నువ్వు తిరిగి వచ్చినందుకు చాల సంతోషిస్తాడు! ఏం, నీ కిష్టంలేదా! నీకు అతన్నడగటానికి అభిమానం అడ్డువస్తే పద నేను అడుగుతాను. కాదంటే కాళ్ళా - వేళ్ళాపడతాను! నా కూతురు కాపురం నిలబెట్టానని అనుకుంటాను లేమ్మా లే! పద!" అన్నాడు జగన్నాథంగారు, ఆమె తలమీద చేయి వేసి నిమురుతూ --

ఆమె చేతుల్లో ముఖం దాచుకొని వెక్కివెక్కి ఏడ్చింది. ఆయన ఆమెను ఓదార్చలేదు .... మాట్లాడించలేదు... చూస్తూ వూరుకున్నాడు.

ఒక నిమిషం పోయాక ఆమె తల ఎత్తింది. కన్నీళ్ళు తుడుచుకున్నది. అక్కర్లేదు బాబాయిగారూ! నేనే వెళ్ళి ఆయన్ని ప్రాధేయపడగలను. నా కళ్ళు తెరిపించారు. మీకు ఎలా ధన్యవాదాలర్పించాలో నాకు తెలియటం లేదు" అన్నది. అంటూనే చటుక్కున వంగి ఆయన కాళ్ళకి నమస్కరించింది.

"పిచ్చి పిల్లా ! లే అమ్మా లే -- సంసారమన్నది ఒక ప్రమిదలాంటిది. ఆడది వెలుగునిచ్చే వత్తి అయితే మొగవాడు వెలగటానికి అవసరమయే శక్తినిచ్చే నూనె. వత్తి వెలుగునిస్తూ తను కాలిపోతున్నానే అని బాధపడక, ప్రత్యక్షంగా వెలుగునివ్వకపోయినా, నూనె కూడా తోడ్పడుతున్నదనీ, తనతోపాటే అదీ హరించుకుపోతున్నదనీ గ్రహించాలి. అప్పుడే తగినంత వెలుగు నివ్వగలదా ప్రమిద. సంసారం కూడా అంతేనమ్మా! దేని గురించీ ఆలోచించి గోరంతను కొండంతను చేసుకోకు ! ఈరోజే నీ భర్త దగ్గరకు వెళ్ళు! "

ఆమెను నెమ్మదిగా పైకి లేవదీసి -- కన్నీరు తుడిచారాయన.